# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 01-07-2016**

కేవలం ప్రభుత్వ కార్యక్రమంగానే కాకుండా తెలంగాణకు “హరితహారం” ఓ ప్రజా ఉద్యమంగా నడవాలని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు ఆకాంక్షించారు.

“హరితహారం” రెండవ విడత కార్యక్రమాన్ని ఈ నెల 8న ప్రారంభించి రాష్ట్ర వ్యాప్తంగా రెండు వారాల పాటు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఉద్యమ రూపంలో చేపట్టాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. పాఠశాల విద్యార్థి నుండి ముఖ్యమంత్రి వరకు అన్ని స్థాయిల పౌరులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ వంతుగా మొక్కలు నాటాలని చెప్పారు. ఈ ఏడాది నాటేందుకు 46 కోట్ల మొక్కలు సిద్ధంగా వున్నాయని వెల్లడించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా ఒకే ఏడాది 46 కోట్ల మొక్కలు నాటిన రాష్ట్రంగా తెలంగాణ రాష్ట్రం చరిత్రలో నిలుస్తుందని కేసిఆర్ అన్నారు. తెలంగాణకు “హరితహారం” కార్యక్రమంపై సచివాలయంలో శుక్రవారం సిఎం సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ శర్మతో పాటు అన్ని శాఖల ముఖ్య కార్యదర్శులు సమావేశంలో పాల్గొన్నారు. ప్రభుత్వ శాఖలన్ని ఎవరికి వారుగా ప్రత్యేక ప్రణాళికా, కార్యాచరణ రూపొందించుకోవాలని సిఎం సూచించారు. గ్రామ స్థాయి నుండి హైదరాబాద్ వరకు అన్ని చోట్ల ఆయా శాఖలు మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏ విధంగా చేపడతారో రెండు మూడు రోజుల్లో ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ నెల 4న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో మరో సారి సమావేశమై తెలంగాణకు హరితహారం కార్యక్రమానికి తుది రూపు ఇవ్వాలని సూచించారు. మున్సిపల్, పంచాయతిరాజ్, వ్యవసాయ, నీటి పారుదల, ఆర్ అండ్ బి శాఖల మంత్రులు కూడా ఈ సమావేశంలో పాల్గొనాలని సిఎం ఆదేశించారు.

"గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో అన్ని చోట్ల మొక్కలు నాటే కార్యక్రమం పెద్ద ఎత్తున జరగాలి. అవసరాన్ని బట్టి పండ్ల చెట్లు, నీడ చెట్లు, ఔషధ మొక్కలు, పూల చెట్లు నాటి రక్షించుకోవాలి. ప్రభుత్వ కార్యాలయాలు, అన్నిరకాల విద్యా సంస్థలు, మార్కెట్ యార్డులు, ఆర్టీసీ, సింగరేణి ప్రాంగణాలు, పోలీసు కార్యాలయాలు, పోలీసు ప్రాంగణాలు, పోలీసు స్టేషన్లలో మొక్కలు నాటాలి. చెరువులు, రిజర్వాయర్లు, నదులు, ఉప నదులు, వాగులు, కాలువలు, వొర్రెలు, వొంకల గట్లపై మొక్కలు నాటాలి. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, ఆర్ అండ్ బి రోడ్లు, పంచాయతిరాజ్ రోడ్ల వెంట మొక్కలు నాటాలి. గ్రామ సర్పంచులు, గ్రామ కార్యదర్శులు చొరవ తీసుకుని ప్రతి ఇంటిలో మొక్కలు నాటేలా ప్రజలను భాగస్వాములు చేయాలి. ప్రభుత్వ కార్యాలయాలన్నింటిలోనూ మొక్కలు నాటాలి. వాటిని రక్షించేందుకు గేట్ల వద్ద ఎనిమల్ ట్రాప్స్ ఏర్పాటు చేయాలి. ఇందుకోసం కలెక్టర్లు, మంత్రుల వద్ద వున్న నిధులను వెచ్చించాలి. ఆసుపత్రులు, గృహసమూదాయాల్లో కూడా మొక్కలు నాటాలి. దేవాలయాలు, మసీదులు, చర్చ్ లు, గురుద్వారాలు తదితర మత ప్రాంగణాలలో కూడా మొక్కలు నాటాలి. మొక్కలు నాటే కార్యక్రమంలో బాగా పనిచేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ప్రభుత్వ శాఖలను గుర్తించి ప్రోత్సాహకాలు అందించాలి. పరిశ్రమలు, పారిశ్రామిక వాడలు, పారిశ్రామిక ప్రాంతాల్లో విరివిగా మొక్కలు నాటేలా యాజమాన్యాలను ప్రోత్సహించాలి" అని ముఖ్యమంత్రి సూచించారు.

తెలంగాణకు "హరితహారం" కార్యక్రమం ద్వారా జరిగే ప్రయోజనాలను ప్రజలకు విడమరిచి చెప్పాలి. తెలంగాణలో అడవులను 33 శాతానికి పెంచే లక్ష్యంతో ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. టీవీలు, పేపర్లు, రేడియోల ద్వారా ప్రచారం నిర్వహించాలి. పోస్టర్లు, బ్యానర్ల ద్వరా రాష్ట్ర మంతా ప్రచారం చేయాలి. సోషల్ మీడియాలో కూడా చర్చ జరగాలి. కవి సమ్మేళనాలు, ఉర్దూ ముషాయిరాలు, విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు పెట్టాలని సిఎం సూచించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**